ప్రచారం సరే ఆచరణ ఏదీ?


కొలిమిగుండ్లలో సీసీ రోడ్డుకు నోచుకోని పోస్టాఫీసు దారి

కొలిమిగుండ్ల: సంక్రాంతి పండుగ నాటికి గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణం చేపడుతామని కూటమి నాయకులు ప్రకటనలు చేశారు. అక్టోబర్ 14 నుంచి 20 వరకు పల్లెల్లో గుర్తించిన చోట్ల రోడ్ల నిర్మాణానికి భూమి పూజలు చేశారు. సంక్రాంతి పండుగకు వారం రోజులే ఉన్నా ఇంకా మండలంలోని పలు గ్రామాల్లో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు మొదలు కాలేదు. ప్రధానంగా కొలిమిగుండ్లలో రెండు చోట్ల సీసీరోడ్ల నిర్మాణం కోసం ఉపాధి హామీ పథకం నిధుల నుంచి రూ.40 లక్షలు మంజూరు చేశారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపం నుంచి పోస్టాఫీస్ వరకు గతంలో ఉన్న సీసీ రోడ్డు పాడైపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్న పాటి వర్షం కురిసినా పలు చోట్ల నుంచి నీరు ఇక్కడికి చేరుతుంటాయి. జనం నడిచేందుకు వీలు లేకుండా పోతుంది. భూమి పూజ చేసి రెండు నెలలు దాటిపోయింది. రోడ్డు పనులు మొదలు పెట్టింటే ఈపాటికి రోడ్డు పూర్తయి సౌకర్యంగా ఉండేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రధాన రహదారిపై చేరుకునే చోట సరిగా లేక బైక్‌ల మీద నుంచి కిందపడుతుండేవారు. ఇటీవలే స్థానికులు మట్టిని వేసి చదును చేశారు. ప్రాథమిక మెయిన్ పాఠశాల, పోస్టాఫీసు, గ్యాస్ ఏజెన్సీ, ప్రైవేట్ ఆస్పత్రి, ప్రైవేట్ పాఠశాల, రేషన్ దుకాణం ఉండడంతో ప్రజలు ఎక్కువ భాగం ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులు స్పందించి త్వరగా రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా


అఖిలపక్ష నాయకులతో మాట్లాడుతున్న ఆర్డీఓ

డోన్ టౌన్: పారదర్శక ఓటర్ల జాబితా రూపొందించేందుకు అందరూ సహకరించాలని ఆర్డీఓ నరసింహులు అన్నారు. సోమవారం స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేందుకు సహకరించాలని కోరారు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు ఉంటే తెలపాలన్నారు. అనంతరం తుది జాబితా విడుదలపై చర్చించారు.

ఎస్ఎఫ్ఐ శిక్షణ తరగతులు

బనగానపల్లె రూరల్: విద్య ఉపాధి కోసం పోరాటాలు చేసేందుకు సిద్ధం కావాలని ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షుడు రమేష్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని యాగంటి క్షేత్రంలో ఉన్న ఏపీ టూరిజం హాల్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లా స్థాయి వైజ్ఞానిక శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. కేంద్రం ఎన్ఈఈపీ-2020 తీసుకొచ్చి విద్యను పూర్తిగా వ్యాపారం చేసిందన్నారు. ఈ విధానంతో పేద మధ్య తరగతి పిల్లలు చదువుకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు రాజా, ఎంఆర్ నాయక్, హరివర్ధన్ పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం

డోన్ టౌన్: పట్టణంలోని త్రివర్ణకాలనీలో ఉంటున్న కొచ్చెర్వు వాసి లారీ డ్రైవర్ వెంకట్రాముడు (46) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. సోమవారం డోన్‌మోటార్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శివరామ్, కార్మికులతో కలిసి మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కొచ్చెర్వు గ్రామానికి చెందిన లారీ డ్రైవర్లు, క్లీనర్లు అందించిన రూ.30 వేలను బాధిత కుటుంబానికి అందజేశారు.

బైపాస్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ


భూమి పూజ చేస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె రూరల్: పట్టణంలో రూ.50 కోట్ల నిధులతో బైపాస్ రోడ్డు నిర్మాణానికి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీలైనంత త్వరగా బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. ఇది పూర్తయితే పట్టణంలో ట్రాఫిక్ సమస్య తగ్గుతుందని తెలిపారు. అలాగే బనగానపల్లె ఆర్టీసీ డిపో నుంచి హైదరాబాద్, తిరుపతికి రెండు కొత్త బస్సు సర్వీసులను మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఈఎన్‌సీ నాయిముల్లా, ఎస్ఈ శ్రీధర్‌రెడ్డి, డీఈఈ సునీల్‌రెడ్డి, ఏఈ హుస్సేని, ఆర్ఎం రజీయా సుల్తానా, డీఎం రవికిశోర్, పీపీ కుమార్ రెడ్డి, గాలిమద్దిలేటిరెడ్డి, అంబల రామక్రిష్ణారెడ్డి, శీనయ్య పాల్గొన్నారు.

సంక్షిప్తం

సనాతన ధర్మ పరిరక్షణకు పాదయాత్ర

ప్యాపిలి: సనాతన ధర్మ పరిరక్షణ కోసం ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన శివకరణ్ సింగ్ చేపట్టిన పాదయాత్ర సోమవారం ప్యాపిలికి చేరుకుంది. 2022 మార్చి 25న శివకరణ్ సింగ్ కన్యాకుమారి నుంచి ఒడిశాకు పాదయాత్ర ప్రారంభించారు. మూడు సంవత్సరాలుగా వివిధ రాష్ట్రాల మీదుగా చేపడుతున్న ఈ పాదయాత్ర ద్వారా ఇప్పటి వరకు సుమారు 19 వేల కిలోమీటర్లు నడిచినట్లు శివకరణ్ సింగ్ తెలిపారు. తన పాదయాత్ర ద్వారా ప్రజలకు సనాతన ధర్మం గురించి అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఒడిశాలో పాదయాత్ర ముగించనున్నట్లు తెలిపారు.

దివ్యాంగ పింఛన్లపై సర్వే

ప్యాపిలి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం సామాజిక పింఛన్ల సర్వే ప్రారంభమైంది. అనర్హులను తొలగించడానికి సర్వే చేస్తున్నట్లు ప్రభుత్వం చెబుతున్నా పింఛన్‌దారుల సంఖ్యను తగ్గించేందుకే సర్వే చేస్తున్నట్లు ప్రజల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది. సోమవారం ప్యాపిలి, పోతుదొడ్డి, మాదినేనిదొడ్డి, గుడిపాడు, చిన్నపొదిళ్ల తదితర గ్రామాల్లో వైద్యబృందం వివరాలు సేకరించింది. మంచానికే పరిమితమైన, దివ్యాంగులైన 25 మంది ఆరోగ్య పరిస్థితి, ధ్రువపత్రాలను పరిశీలించారు. నివేదిక ప్రభుత్వానికి పంపనున్నట్లు వైద్యాధికారులు ఇల్లోజి, మాధవి తెలిపారు.

రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత తప్పనిసరి

బేతంచెర్ల: మండలంలో పల్లె పండుగ కార్యక్రమం కింద వేస్తున్న సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణాలను నాణ్యతగా చేపట్టాలని పంచాయతీరాజ్ ఇంజినీర్ మహేష్ అన్నారు. సోమవారం మండలంలోని రంగాపురం, ఎం. పేండేకల్లు, అంబాపురం గ్రామాల్లో వేస్తున్న సీసీరోడ్లు, కాలువలను పరిశీలించారు. పలు సూచనలు చేశారు.

వేడుకగా పల్లకీ సేవ


పల్లకీ సేవ నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమామహేశ్వరస్వామికి సోమవారం పల్లకీ సేవను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం స్వామిఅమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు, నైవేద్య సమర్పణ చేసి కర్పూర నీరాజనాలు పలికారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. ఈఓ చంద్రుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

క్లుప్తంగా

ముచ్చట్ల మల్లికార్జునస్వామికి పూజలు


స్వామివారికి పూజలు చేస్తున్న భక్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్.కొట్టాల గ్రామ సమీపంలో వెలసిన ముచ్చట్ల భ్రమరాంబ, మల్లికార్జునస్వామి ఆలయంలో పుష్యమాసం సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో భక్తులు స్వామివారికి రుద్రాభిషేకం, బిల్వార్చన, కుంకుమార్చన, ప్రత్యేక పుష్పాలంకరణ చేసి మహామంగళహారతి ఇచ్చారు.

ముమ్మరంగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటు

అవుకు: మండల కేంద్రంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ముమ్మరంగా సాగుతోంది. గత ఏడాది నవంబర్ నుంచి స్మార్ట్ మీటర్ల ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. మొదటగా ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అన్నీ దుకాణాల్లో ఏర్పాటు చేస్తున్నారు. పాత మీటర్లను తొలగించి వాటి స్థానంలో స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారు.

10న జాబ్ మేళా

డోన్ టౌన్: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 10వ తేదీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం వాల్ పోస్టర్లను విడుదల చేశారు. హరిత డెవలపర్స్, ఏపీఏసీ ఫైనాన్షియల్ సర్వీసెస్, ఫ్యూషన్ ఫైనాన్స్ సంస్థల ప్రతినిధులు ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేస్తారన్నారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. వివరాలకు 95426437 47, 7981238237 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

నేడు విద్యుత్ చార్జీలపై ప్రజాభిప్రాయ సేకరణ

డోన్ టౌన్: 2025-26కు సంబంధించి డిస్కంలో ప్రతిపాదించిన వార్షిక ఆదాయం, అవసరాలు, విద్యుత్ చార్జీలపై ఈ నెల 7,8వ తేదీల్లో విజయవాడ నుంచి, 10వ తేదీ కర్నూలు నుంచి ఉన్నతాధికారులు వర్చువల్ విధానంలో ప్రజాభిప్రాయ సేకరణ చేయనున్నట్లు డోన్ ఇన్‌చార్జ్ ఈఈ శ్రీనివాసరెడ్డి తెలిపారు. డోన్ కొత్తబస్టాండ్ పక్కనున్న విద్యుత్ శాఖ ఏఈ కార్యాలయంలో ఉదయం 10:30 నుంచి ఒంటి గంట వరకు తిరిగి మధ్యాహ్నం 2 నుంచి 4:30 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందని తెలిపారు. వినియోగదారులు తమ అభిప్రాయాలు తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

పశువైద్యశాలకు మందులు


పశువైద్యులకు మందులు అందజేస్తున్న ఏడీఏ

బనగానపల్లె రూరల్: పశువైద్యశాలల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నట్లు బనగానపల్లె పశుసంవర్ధకశాఖ ఏడీఏ డాక్టర్ మారుతీసకారామ్ తెలిపారు. సోమవారం నంద్యాల పశుసంవర్థక శాఖ నుంచి బనగానపల్లె ఏడీఏ కార్యాలయానికి మందులు వచ్చాయి. వాటిని ఆయన పరిశీలించారు. పశువులు, గొర్రెలు, మేకలు తదితర మూగజీవాలకు సుమారు 180 రకాల జబ్బులకు మందులు వచ్చినట్లు తెలిపారు. వీటిని బనగానపల్లె అవుకు మండలాల్లోని పశువైద్యశాలలకు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు.

ప్రకృతి వ్యవసాయంతో ఎన్నో ఉపయోగాలు


కూరగాయలను పరిశీలిస్తున్న ఏఓ

బనగానపల్లె: ప్రకృతి వ్యవసాయంతో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని యాగంటిపల్లెలో నాగ సుధా, రామచంద్రారెడ్డి సహజ సిద్ధంగా పండించిన టమాట, ముల్లంగి, గోంగూరను తహసీల్దార్ కార్యాలయం వద్ద విక్రయానికి ఉంచారు. ఉద్యోగులు ఇష్టపూర్వకంగా కొనుగోలు చేసినట్లు ఏఓ తెలిపారు. ప్రకృతి వ్యవసాయం పర్యావరణానికి, ఆరోగ్యానికి మంచిదన్నారు.

కంపచెట్ల తొలగింపు

కొలిమిగుండ్ల: స్థానిక కొండపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వెళ్లే దారిలో ఉన్న చెత్త సంపద కేంద్రం వద్ద సోమవారం సర్పంచ్ శివరాముడు ఆధ్వర్యంలో కంపచెట్లు తొలగించారు. చాలా రోజుల నుంచి నిరుపయోగంగా ఉండడంతో చుట్టూ కంపచెట్లు పెరిగిపోయి అస్తవ్యస్థంగా మారిపోయింది. జేసీబీతో పూర్తిగా తొలగించి శుభ్రం చేశారు. పనులను ఈఓఆర్డీ శివప్రసాద్ పరిశీలించారు. త్వరలోనే చెత్త సంపద కేంద్రాన్ని వాడుకలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పంచాయతీకి ట్రాక్టర్ మంజూరు కావడంతో ట్రాలీ రాగానే చెత్తసేకరణ చేపడుతామన్నారు.

రోల్ మోడల్‌గా డోన్

● అందుబాటులో మెరుగైన విద్య, వైద్యం ● రియల్ ఎస్టేట్, ఆటోమొబైల్ రంగాల జోరు


దోన్ పట్టణంలో నూతనంగా ఏర్పాటైన షాపింగ్ కాంప్లెక్స్


డోన్‌లోని జువెలరీ దుకాణం

డోన్: డోన్ పట్టణం కొన్నేళ్లుగా మంచి ప్రగతిని సాధిస్తోంది. మెరుగైన విద్య, వైద్య సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. పట్టణ జనాభా 1.50 లక్షలు. నియోజకవర్గ కేంద్రం, రైల్వే జంక్షన్ కావడంతో పారిశ్రామిక, వ్యాపార రంగాలు జోరందుకున్నాయి. ఇక్కడ ప్రభుత్వ, ప్రవేట్ స్కూళ్లతో పాటు కార్పొరేట్ కళాశాలలు, బీఈడీ, డీఈడీ, ఐటీఐ, కియా నాలెడ్జ్ సెంటర్, కేంద్రీయ విద్యాలయ, గురుకుల పాఠశాలలతో పాటు వివిధ కోచింగ్ సెంటర్లు ఉన్నాయి.

వైద్య, విద్య రంగాల్లో అగ్రగామి

పట్టణంలో సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. జిల్లా కేంద్రాలైన కర్నూలు, నంద్యాల స్థాయిలో వైద్య, విద్య సౌకర్యాలు ఇక్కడ ఉన్నాయి. శ్రీసుధ, శ్రీఅక్షర, శ్రీనివాస విద్యానికేతన్, జ్యోతి, ఫోటాన్ ఇన్‌స్టిట్యూట్, లిటిల్ ఫ్లవర్స్, శ్రీరాధాక్రిష్ణన్ పాఠశాలలు, యశోద, నవ్య, మహాలక్ష్మి, కేవీఎస్, రమ్యశిల్ప, ప్రజావైద్యశాల, వాణి మల్టీ స్పెషాలిటీ, కేఆర్ హాస్పిటల్ వంటి ఆస్పత్రులు ఉన్నాయి. గెలాక్సీ చికెన్ సెంటర్‌లు ప్రజాభిమానాన్ని చూరగొన్నాయి.

నలు దిక్కులా రియల్ ఎస్టేట్

పట్టణానికి ఆనుకుని ఎన్‌హెచ్ 44, మరోవైపు తమ్మరాజు పల్లె నుంచి యు. కొత్తపల్లె వరకు ఎన్‌హెచ్ 41బీ1 వంటి జాతీయ రహదారులు రావడంతో రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంది. అనేక అపార్టుమెంట్లు నిర్మించడంతో పాటు లే అవుట్‌లు, నాన్ లేఅవుట్ వెంచర్‌లు వెలిశాయి. ఫలితంగా పట్టణ రూపురేఖలే మారిపోయాయి. కేంద్ర, రాష్ట్ర ఉద్యోగులతో పాటు గ్రామీణ ప్రాంతానికి చెందిన పలువురు భవన నిర్మాణ రంగంలో పెట్టుబడులు పెట్టడం వల్ల పట్టణ విస్తీర్ణం వేగంగా పెరిగింది.


విస్తరించిన ఆటో మొబైల్ రంగం

ఆటోబాడీ నిర్మాణంలో కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో డోన్ ప్రసిద్ధి చెందింది. నారపరాయి పౌడర్, సుద్ద, డోలమైట్ క్వార్జ్ వంటి ఖనిజాలు ఇక్కడి నుంచి ఎగుమతి అవుతోంది. దీంతో వందలాది వాహనాలు వాటి అనుబంధ పరికరాలు లభించే ఆటో మొబైల్ షాప్‌లు అధికంగా ఏర్పాటయ్యాయి. పలు బహుళ జాతి కంపెనీలకు చెందిన దుకాణాలు వెలిశాయి. యువతీయువకులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయి.


అందుబాటులో మెరుగైన వైద్యం


ఆటో బాడీ తయారీ కేంద్రం

ద్రోణుడు తపస్సు చేసిన ప్రాంతం



పూర్వం ద్రోణుడు కొండ(చలం)పై తపస్సు చేసినందు వల్ల ఈ ప్రాంతానికి ద్రోణాచలం అనే పేరు వచ్చిందని పూర్వీకులు చెబుతుంటారు. అయితే ఈ కొండపై ఆంజనేయస్వామి, మౌలాలిస్వామి మందిరాలతో పాటు చర్చి ఉంది. 40 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహం, ద్రోణాచారుని విగ్రహాలు సందర్శకులను విశేషంగా ఆకర్షిస్తాయి. మత సామరస్యానికి అండ.. డోన్ కొండ అని ఈ ప్రాంతం వాసులు సగర్వంగా చెప్పుకుంటారు. హిందువులు, క్రిస్టియన్లు, ముస్లింలు ఎంతో అన్యోన్యంగా కలిసి ఉంటున్నారు. దివంగత నీలం సంజీవరెడ్డి, కోట్ల విజయభాస్కర్ రెడ్డి, రావ్ బహదూర్ శేషారెడ్డి లాంటి ఎందరో మహామహులు ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గం డోన్.